



# అంత్యక్రియ


పొత్తూరి విజయలక్ష్మి


శ్రీవారి నోటి వెంట ఆ మాట రాగానే ఆ గదిలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. హాలు నిండా అంతమంది జనం ఉన్నా అందరూ నోరావలించి ఉండిపోవడం వల్ల పిన్‌డ్రాప్ సైలెన్స్. కాసేపటికి తేరుకున్నాడు శ్రీవారి కుడి భుజం.

**"తమరి అంత్యక్రియలు తాము చేసుకోడం ఏమిటి మహాప్రభూ?అసలిది ఎలా సాధ్యం?" తాను విన్నది పొరపాటేమో అనే సందేహంతో ప్రశ్నించాడు.**

చిద్విలాసంగా నవ్వారు శ్రీవారు "అవును మా అంత్యక్రియలు మేమే స్వయంగా జరిపించుకుంటాం!" హుందాగా శెలవిచ్చారు.

అప్పటికి అందరూ ఆశ్చర్యం నుంచి తేరుకున్నారు. బుర్రలు గోక్కుంటూ మెదళ్లకు పని కల్పించారు. చూడబోతే ఇందులో ఏదో అంతరార్థం ఉంది అనుకున్నారు. "వివరంగా విశదీకరించండి ప్రభూ" విన్నవించుకున్నారు ముక్తకంఠంతో.

మరోసారి చిద్విలాసంగా నవ్వి వివరించడం మొదలు పెట్టారు శ్రీవారు. వారింత మహత్తరమైన నిర్ణయం తీసుకోడానికి వెనుక ఒక మహత్తరమైన గాధ ఇమిడి ఉంది.

వారం రోజుల క్రిందట ఒక మహనీయుడు పరమపదించాడు. సరే. అది ప్రకృతి సహజం! అందులోనూ ఆయన వయోవృద్ధుడు. దేశానికి ఎంతోసేవ చేసిన ఆ మహనీయుడి మరణం పట్ల అందరూ దుఃఖం వెలిబుచ్చారు. జాతీయ పతాకాలు సగం వరకు దించేశారు.
అయిదు రోజులు సంతాపదినాలుగా ప్రకటించారు.

సంతాప సభలు ఏర్పాటు చేశారు. బలవంతాన శోకం ప్రకటిస్తూ మొహం వేలాడేసుకుని సభకు హాజరయ్యారు శ్రీవారు. దుఃఖం తెచ్చిపెట్టుకుని ఆ చచ్చిపోయిన వ్యక్తి ఆత్మకు తలనొప్పి?? వచ్చేలా పొగిడారు.

దాంతో ఆయనకి తలనొప్పి వచ్చింది. సభలు ముగించి హమ్మయ్య ఇక ఇంటికి వెళ్లి ఉల్లాసంగా కాలక్షేపం చేద్దాం అనుకుంటూ ఇంటికి చేరిన శ్రీవారికి అక్కడి పరిస్థితి చూసి నిజంగా దుఃఖం వచ్చింది.

ఆయన శ్రీమతి కథాకళి ఆడేస్తోంది. కూతురు, కొడుకు, చిందులు తొక్కుతున్నారు.
కూతురికి కాలేజీలో డ్రామా ప్రోగ్రాం కేన్సిల్ అయిపోయింది. కొడుకు ఆడబోయే క్రికెట్ మ్యాచ్ పోస్ట్‌పోన్ అయిపోయింది.

ఇక శ్రీమతిగారు. ఆవిడ వేలువిడిచిన మేనల్లుడి ప్రోగ్రాం టి.విలో ఉంది. అతగాడిని పిచ్చికుక్క కరిస్తే శ్రద్ధగా ఇంజక్షన్లు చేయించుకునాడు. ఆ సందర్భంలో అతనికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశారు టివి వాళ్లు. ఆవిడ బోలెడంత ఆనందపడిపోయి ఆ ప్రోగ్రాం చూడమని అందరితోనూ చెప్పేసింది. సమయానికి ఆ ప్రోగ్రాం కాస్తా ఆగిపోయింది.

తమ ఆశా భంగానికి కారకుడైన ఆ దివంగతుడిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిపోస్తున్నారు. ఈ గొడవ చూసిన శ్రీవారి మనసు వికలం అయిపోయింది.



ట్రాఫిక్ పోలీసు పేరయ్యా తన మిత్రుని ఇంటికి వివాహానికి వెళ్ళాడు. అందరిలో అతను కుర్చీలో కూర్చోక నిలబడే ఉండటం పేరయ్యా మిత్రుని భార్య చూసి "చాలా సేపట్నుంచీ అలా నిల్చునే ఉన్నారే, కూర్చోండి అన్నయ్యా గారూ!" అంది.
"కూర్చుంటే కాళ్ళు నొప్పెడ్తాయమ్మా!" అన్నాడు. పేరయ్యా.

-బి. పాండురంగారెడ్డి
కరీంనగర్

ఆ రాత్రంత కంటి మీద కునుకు లేదు. ఆ మరణించిన మనిషి నిజమైన నాయకుడు. నిస్వార్థసేవ చేసిన మహనీయుడు. అటువంటి గొప్పవాడి మరణం పట్ల సంతాపం ప్రకటించమంటేనే ప్రజలు ఇబ్బంది పడుతూ ఉంటే భవిష్యత్తు తెలుసుకుని భయం కలిగిందాయనకి.

పుట్టిన రోజుల్లా ఇది కూడా గ్రాండ్‌గా జరిగిపోతే ఎంత బావుంటుంది? కానీ ఎలా? ఆలోచించగా ఆలోచించగా చక్కటి ఉపాయం తట్టింది. ఆ తర్వాత నిశ్చింతగా నిద్రపట్టింది.

సంతాప దినాలు అయిపోయేక అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. తమ నిర్ణయాని తెలియజేశారు.



ఓ తాగుబోతు బాగా తాగి బార్‌లో వైట్ డ్రస్ వేసుకున్న ఓకాయన్ని వెయిటర్ అనుకుని పిలిచాడు "ఓయ్! ఓటాక్సీ తీసుకొని రా! ఇంటికెళ్లాలి"!
"నేను ఎవరనుకున్నావు, నావల్ ఆఫీసర్‌ను అన్నాడా వ్యక్తి
వెంటనే,
తాగుబోతు: అయితే పడవను పంపించు!"
అన్నాడు తాపీగా.

-శేఖర్‌చంద్ర
నడిగూడెం

వారి కోరిక ప్రకారం వివరంగా చెప్పడం ప్రారంభించారు.
"మీ కందరికీ తెలును. నా సర్వస్వం ప్రజలకే అంకితం చేశాను. ఈ జీవితం, ఈ శరీరం, అన్నీ ప్రజలకే. అంతేకాదు మరణించాక నా చితా భస్మంతో పాటు నా ఆత్మ కూడా ప్రజలదే.

నా మరణానంతరం నా ప్రజలు నా కోసం దుఃఖించడం, సంతాపం వెలిబుచ్చడం నా ఆత్మ సహించలేదు. ఈ ఆర్భాటాలు నాకు గిట్టవు. అందుకే నా అంత్యక్రియలు నేనే జరిపించుకుంటాను. అలా అయితే నా కోసం విలపించే నా ప్రజలను ఓదార్చే అవకాశం ఉంటుంది. ఏ విధమైన ఆర్భాటాలూ లేకుండా నా ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఉంటుంది. అందుకే ఈ నిర్ణయానికి వచ్చాను" అంటూ గంభీరంగా వివరించారు.

మళ్లీ నిశ్శబ్దం. అందరు మొహమొహాలు చూసుకున్నారు. చిన్నగా నవ్వుకున్నారు. "అద్భుతంగా ఉంది మీ ఆలోచన" అన్నారు ఏకగ్రీవంగా.

చిన్నగా నవ్వేరు శ్రీవారు. "నా ఆలోచన మీకందరికీ అంగీకారం అయినందుకు చాలా ఆనందంగా ఉంది. వీలైనంత త్వరలో ఆ కార్యక్రమం జరిపించాలని మా కోరిక" అన్నారు.

"అవశ్యం మహాప్రభో. మీరు నిశ్చింతగా ఉండండి. అతి త్వరలో అత్యంత శ్రద్ధగా, ఎవరూ కనీవినీ ఎరుగనంత ఘనంగా మీ అంత్యక్రియల కార్యక్రమం ఏర్పాటు చేస్తాం అన్నారు.

ఆ తర్వాత అందరూ ఆ విషయమై చర్చలు మొదలు పెట్టారు. చక్కగా ప్లాన్ చేశారు. చూస్తుండగానే ప్రోగ్రాం తయారైపోయింది.

అద్భుతంగా జరుగనున్న ఆ కార్యక్రమం ఊహించుకుని శ్రీవారి కుడి భుజానికి నోరూరింది.
"ప్రభూ! నేనూ దేశానికి నా జీవితాన్ని అంకితం చేసిన వాడినే. మరి వన్లేవనిగా నేనూ అంత్యక్రియలు చేసుకుకోనా?" సర్దాపడ్డాడు.

శ్రీవారికి చిర్రెత్తుకొచ్చింది. "ఏడైనా సరే నేను మొదలు పెట్టడం ఆలస్యం. తోకల్లా తయారైపోతారు" విసుక్కున్నారు.
కుడిభుజం మొహం మాడిపోయింది.

అది గమనించి ఆయన్ని పక్కకు తీసుకెళ్లాడు కుడి భుజంగారి కుడి భుజం.
"ఇప్పటికి ఊరుకోండి. దైవం చల్లగా చూస్తే మీరు ఇంత కంటే గ్రాండ్‌గా జరిపించుకోవచ్చు భవిష్యత్తులో అన్నాడు.

కుడి భుజం గారి మొహం వెలిగిపోయింది.
ఆ తర్వాత ఇంకేం చికాకులు లేకుండా సమావేశం ముగిసింది. శ్రీవారి అంత్యక్రియల వార్త ప్రజలందరికీ తెలిసిపోయింది.
కార్యక్రమం అంతా పటిష్టంగా రూపొందించబడింది. శ్రీవారి స్వస్థలంలో జరుగుతాయి అంత్యక్రియలు.

ఊరి చివర పాతిక ఎకరాల ఖాళీ స్థలంలో మధ్యగా ఎత్తైన వేదిక నిర్మించబడుతుంది. ఆ పాతిక ఎకరాల్లోనూ పళ్ల తోటలు పెంచుతారు [నిదానంగా] వేదికకి కాస్త దూరంలో ఒక షెడ్ వేస్తారు. ఆ షెడ్‌లో భవిష్యత్తులో అవసరం అయ్యే పాలరాళ్లు, గంధం చెక్క మొదలైన సామగ్రి భద్రపరుస్తారు.

నిర్ణీత దినం నాడు మహానగరంలో ఓ బ్రహ్మాండమైన సభ జరుగుతుంది. అనంతరం శ్రీవారు, వారి ప్రజలు ఊరేగింపుగా బయలుదేరి శ్రీవారి స్వస్థలానికి చేరుకుంటారు. శ్రీవారు శాస్త్రార్థం ఆ వేదిక మీద ఓసారి పడుకొంటారు. జనం అంత పెద్ద పెట్టున ఏడుస్తారు. అంతటితో ఆ కార్యక్రమం ముగుస్తుంది.

కార్యక్రమాన్ని క్లుప్తంగా జరిపించమన్నారు శ్రీవారు. కానీ వారి అంతరంగికులు అంగీకరించలేదు. అదేం వీల్లేదు. మీ వంటి మహామనీషి అంత్యక్రియలు అల్లాటప్పాగా జరగడం అన్యాయం. అట్టహాసంగా జరగాల్సిందే అన్నారు.

ఆనందించారు శ్రీవారు. "సరే మీ ఇష్టం మీరింతగా పట్టుబడితే నేనేం చెయ్యగలను? మీ సంతోషమే నా సంతోషం. కానివ్వండి" అన్నారు.

ఏర్పాట్లు పెద్ద ఎత్తున ప్రారంభం అయ్యాయి. దేశం నలుమూలల నుంచి దుఃఖితులైన ప్రజలను తరలించి తెచ్చే ఏర్పాటు జరిగింది. వారందరికీ శోకసూచకంగా నల్ల చొక్కాలు ఇచ్చే పథకం అమల్లో పెట్టబడింది. మామూలుగా సభల్లో చప్పట్లు కొట్టే పార్టీలకే మరికాస్త సంతోషపెట్టి ఏడవడానికి ఏర్పాటు చెయ్యడం జరిగింది. దుఃఖితులకు అన్నం పొట్లాలు ఇచ్చే ఏర్పాటు కూడా జరిగింది.

మహానగరం నుంచి గ్రామానికి వెళ్లే నిమిత్తం అతి ముఖ్యులకు ఏ.సి. కార్లు మామూలు ముఖ్యులకు మామూలు కార్లు, ప్రజానీకానికి లారీలు అసంఖ్యాకంగా ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి బోలెడంత పబ్లిసిటీ ఇచ్చారు. వార్తా పత్రికల ద్వారా ప్రచారం చెయ్యడమే కాకుండా "పోతాడా పోతాడా మంచివాడు పోతాడా" అంటూ పాటలు కట్టి మైకుల్లో పాడించేరు.


అందరూ ఎదురు చూస్తున్న ఆ దుర్దినం రానే వచ్చింది.

మహానగరం నడి బొడ్డున సమావేశం అయ్యారు జనం. అందరూ నల్ల చొక్కాలు వేసుకున్నారేమో కనుచూపు మేర నల్లని మేఘం ఆవరించినట్లు ఉంది. ధవళవస్త్రాలు ధరించి వేదికను అధిష్ఠించారు శ్రీవారు.

ప్రజల నుద్దేశించి మాట్లాడారు!

నా ప్రజలారా! నా కన్న బిడ్డలారా! నా తోబుట్టువులారా!

మీకు నా గురించి బాగా తెలుసు. నేనెటువంటి నిస్వార్థజీవినో మీకు తెలుసు. నేనేం చేసినా మీ కోసమే. ఇప్పుడీ అంత్యక్రియ కార్యక్రమం కూడా మీ కోసమే. మీ క్షేమం కోరే నేనీ పని తలపెట్టాను.




ప్రొప్రయిటర్: ఇంతకు ముందు ఎక్కడ పని చేశావు?
వెయిటర్: చాలా పెద్ద హోటళ్లలో చేశాను సార్!
ప్రొప్రయిటర్: సాక్ష్యమెవరు?
వెయిటర్: అక్కడ నుంచి తెచ్చిన చెంచాలు, గిన్నెలు, కంచాలు తెచ్చి చూపెట్టమంటారా?


-శేఖర్‌చంద్ర
నడిగూడెం

మన దేశంలో ఓ పద్ధతి అమల్లో ఉంది. దేశ నాయకుడు మరణిస్తే ఆయన గౌరవార్థం విద్యా సంస్థలనూ, ప్రభుత్వ కార్యాలయాలనూ, కర్మాగారాలనూ మూసివేస్తారు.

అయితే దాని వల్ల దేశానికి ఎంత నష్టం? ఆ నష్టం అలా ఉండగా అంత్యక్రియలనీ అట్టహాసాలనీ మళ్లీ అదనపు ఖర్చు.

ఇదంతా చూస్తుంటే నా గుండె మండిపోతోంది. ప్రజా ధనం ప్రతిపైసా ప్రజలకే చెందాలి. అర్థం లేని ఆర్భాటాల కోసం ప్రజా ధనం వెచ్చించడం ఘోరమైన అపరాధం.

అందుకే నా అంత్యక్రియలు ఇలా జరిపేస్తున్నాను. నా మరణ అనంతరం ఊరేగింపులు గానీ, సంతాప సభలు గానీ మరే విధమైన లాంఛనాలు గానీ ఉండరా



"ఏమిటీ, దొంగల్ని పట్టుకుంటానికి వెళ్ళే ముందు విజిల్ వేస్తూ పోవాలా, ఎందుకు?" అడిగాడు కొత్తగా చేరిన పి.సి.
"మేం వస్తున్నాం, మీరెటైనా పారిపోండి అని తెలియటానికి, తర్వాత మనల్నెలాగూ కలుస్తారుగా!" చెప్పాడు సీనియర్ పి.సి.

-బి. పాండురంగారెడ్డి
కరీంనగర్

దని కోరుకుంటున్నాను. అసలు నిజానికి నేను నేడు మరణించాను. అన్నారు గంభీరంగా

జనం అంత భోరున ఏడ్చారు. వారిని ఏడవద్దని ఓదారుస్తూనే వారించాడు. కాసేపు దుఃఖించారు శ్రీవారు. అనంతరం కళ్లు తుడుచుకుని వేదాంతం బోధించారు. భగవద్గీతలోని శ్లోకాలు చదివి వాటి అర్థం వివరించారు.

దాంతో జనం తెలుసుకుని ఏడవడం ఆపేశారు జనం. ఆ తర్వాత ప్రముఖులు అందరూ ఒక్కొక్కరే వెళ్లి శ్రీవారికి దండలు వేశారు.

అనంతరం ఊరేగింపు బయలుదేరింది.

ముందు శ్రీవారి వాహనం. పూలతో అలంకరించిన వాహనం మీద పద్మాసనం వేసుకొని కూర్చున్నారు శ్రీవారు. వారి వెంట కార్లు, లారీలు, ఆర్భాటంగా బయలుదేరింది ఊరేగింపు. దారికి ఇరు పక్కలా జనం.

గమ్యం చేరేసరికి సాయంత్రం అయింది. ఊళ్లో వేదికను అందంగా అలంకరించి గంధపు కర్రలు పేర్చి ఉంచారు. మంత్రఘోష మధ్య శ్రీవారు ఆ చితి మీదికి ఎగబాకి పడుకున్నారు. జనం అంత గొల్లున ఏడ్చారు.

రెండు నిమిషాల తర్వాత చితి మీద నుంచి దిగి వచ్చారు శ్రీవారు. ప్రజలను చూసి చిరునవ్వు నవ్వారు. ఎంతో ప్రశాంతంగా ఉందా నవ్వు.

కార్యనిర్వాహకులు వేదిక మీదకి వచ్చి ఆ గంధపు చెక్కలు తీసి షెడ్‌లో భద్రపరచి స్టేజ్ మీద కుర్చీలు వేసి మైకులు అమర్చి క్షణంలో అంత సిద్ధం చేసేశారు.

శ్రీవారు మైక్ దగ్గరకు వచ్చారు.

ప్రజలారా! నాకిప్పుడెంతో ప్రశాంతంగా ఉంది. శరీరం వదలి కేవలం ఆత్మతో ఉన్నంత సుఖంగా ఉంది. ఇక నేను ప్రాపంచిక విషయాల నుంచి విముక్తుడను. మీసేవే నా పరమార్థం" అన్నారు.

జనం హర్షధ్వానాలు చేశారు. ఆ తరువాత "ఇపుడు ఈ కార్యక్రమంలోని ముఖ్య అంశం" అని ప్రకటించారు కార్యకర్తలు.

శ్రీవార్ని పొగుడుతూ ఉపన్యాసాలు ఇచ్చి దండలు వేసి శాలువాలు కప్పారు. ఆ తర్వాత వెండి పళ్లెంలో ఎర్రని మొఖమల్ గుడ్డ పరిచి దాని మీద బంగారంతో చేసిన పిండాలు మూడు [దబ్బకాయ సైజువి] ఉంచి శ్రీవారికి బహూకరించారు. చిరునవ్వుతో అందుకున్నారు శ్రీవారు.

వందన సమర్పణ అనంతరం కార్యక్రమం ముగిసింది.

ఆనందంతో ఇంటికి చేరిన శ్రీవారు శ్రీమతిగారికి ఆ పిండాలను అందించారు. అందుకుని ఆనందించింది ఆవిడ.

అంతలోనే సీరియస్‌గా అయిపోయింది.

"ఏమిటో! ఈ ఆలోచన ముందుగానే తట్టి ఉంటే ఎంత బాగుండేది? పదవిలోకి వచ్చి నాలుగేళ్లు అయింది. రాగానే ఈ పని చేస్తుంటే ఏడాదికోసారి తద్దినం, తద్దినానికి మూడు చొప్పున పన్నెండు బంగారు పిండాలూ వచ్చుండేవి లక్షణంగా అనేసింది.

గతుక్కుమని అంతలోనే సర్దుకున్నారు శ్రీవారు.

"ఇప్పుడు మాత్రం ఏం? తద్దినాలు కాపోతే మాసికాలు పెట్టించుకుంటాను. అప్పుడు ఏడాది తిరిగే సరికి ఇంటి నిండా బంగారం పిండాలే!" అంటూ ఓదార్చారు. ●